
సాక్షి
వికారాబాద్
గురువారం ı 15 ı ఫిబ్రవరి ı 2024



పులి కాదు.. హైనా!

దౌల్తాబాద్ పరిధిలోని ఫారెస్టులో పులి పాద ముద్రలను పోలిన ఆనవాళ్లు కనిపించడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. 8లో▸



తాండూరులోని పాఠశాలలో పూజలందుకున్న సరస్వతీ మాత



తాండూరు టౌన్: చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న తల్లిదండ్రులు

వైభవంగా వసంత పంచమి

జిల్లాలో వసంత పంచమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంతకుముందు చదువుల తల్లి సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రాయితీ చలాన్ల చెల్లింపునకు నేడు ఆఖరు

ధారూరు: వాహనాల పెండింగ్ చలాన్లను రాయితీతో చెల్లించేందుకు గురువారంతో గడువు ముగుస్తుందని ధారూరు సీఐ రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గడువు పొడిగించే అవకాశం లేదని వివరించారు. 15వ తేదీ తరువాత పెండింగ్ చలాన్లు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

అనంతగిరి: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్పీ కోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్సు లేని వారికి వాహనాలు ఇస్తే ఆ యజమానిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనం నడపరాదని సూచించారు.

దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకోవాలి

వికారాబాద్ అర్బన్: తాండూరులో నిర్వహించే సదరం క్యాంపునకు హాజరయ్యే దివ్యాంగులు ఈ నెల 17వ తేదీ ఉదయం 11నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 20, 23, 26, 27, మార్చి 8, 9, 16, 19, 30 తేదీల్లో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగవైకల్యం, బుద్ధి మాంద్యం, చెవుడు, మూగ వారు స్లాట్ బుక్ చేసుకొని రావాలని తెలిపారు. అలాగే ఈ నెల 20, 21, 23, 27 మార్చి 6, 22, 26, 27 తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సదరం క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదరం సర్టిఫికెట్ కాలపరిమితి అయిపోయిన వారి తోపాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న వారు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.

నేడు అవగాహన సదస్సు

వికారాబాద్ అర్బన్: పీఎం విశ్వకర్మ పథకంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ వినయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని సమావేశ మందిరంలో సదస్సు ఉంటుందని తెలిపారు. కుమ్మరులు, విశ్వబ్రాహ్మణులు, స్వర్ణకారులు, శిల్పులు, కమ్మరులు, చేతివృత్తుల వారు, హస్త కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొననున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ఈ నెల 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రేణుకాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.6వ తరగతిలో 100 సీట్లు, 7నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ. 200 రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

జీపీని సందర్శించిన మహారాష్ట్ర బృందం



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

మొయినాబాద్: పంచాయతీ రాజ్ వ్యవస్థపై శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర అధికారులు, ప్రజాప్రతినిధుల బృందం మండల పరిధిలోని చిలుకూరు పంచాయతీని సందర్శించింది. రాజేంద్రనగర్‌లోని టీఎస్ఐఆర్‌డీలో పంచాయతీ రాజ్ వ్యవస్థపై మూడు రోజుల శిక్షణ పొందుతున్న మహారాష్ట్రకు చెందిన 25 మంది జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం చిలుకూరు పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం, ఎంపీడీఓ సంధ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, పంచాయతీ సిబ్బందితో మాట్లాడి గ్రామ పంచాయతీ పరిధిలో ఎవరెవరు ఏయే పనులు చేస్తారు.. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు ఏమిటి.. ఉపాధి హామీ పనులను ఎవరు పర్యవేక్షిస్తారు.. మండల స్థాయిలో ఏయే అధికారులు ఉంటారు.. వారి విధులు ఏమిటనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

'కడా'కు రూ.3,700 కోట్లు



కొడంగల్‌లో స్థలాల పరిశీలనకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని, కలెక్టర్ నారాయణరెడ్డి (ఫైల్)

సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళిక

- తొలుత విద్యాభివృద్ధికి ప్రాధాన్యత
- స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి
- జిల్లాకు మరిన్ని ప్రాజెక్టులు
- వారంలో కొడంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

వికారాబాద్: కొడంగల్ నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయి. ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టింది మొదలు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే కడా(కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)ను ఏర్పాటు చేసి.. ప్రత్యేక అధికారిని నియమించారు. గడిచిన నెల 15 రోజులుగా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ. 3,700 కోట్లు మంజూరయ్యాయి. ఈ నెల 8న సీఎం కొడంగల్ పర్యటనకు రావాల్సి ఉండగా అ సెంబ్లీ సమావేశాలు ఉండటంతో ఆయన పర్యటన వాయిదా పడింది.వారం రోజుల్లో సీఎం కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు సమాచారం. దీంతో కడా అధికారులతో పాటు రెండు జిల్లాల కలెక్టర్లు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కొడంగల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, కోస్గిలో లక్ష మందితో నిర్వహించే బహిరంగ సభలో సీఎం పాల్గొననున్నట్లు తెలిసింది.

ఎడ్యుకేషన్ హబ్‌గా..

కొడంగల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు మంజూరైన పనుల్లో ఎక్కువ శాతం ఉన్నత విద్యా సంస్థలకు సంబంధించినవే ఉన్నాయి. నియోజకవర్గానికి రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు (ఉమెన్స్, ఇంజనీరింగ్) మంజూరయ్యాయి. గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ. 224 కోట్లతో మెడికల్ కళాశాల, పారా మెడికల్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. కలెక్టర్ నారాయణరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థలాల గుర్తింపు ప్రక్రియను దాదాపు పూర్తి చేశారు. ప్రభుత్వ స్థలాల తోపాటు ప్రైవేటు, అసైన్డ్ భూములను సేకరిస్తున్నారు. అలాగే రూ. 2,945 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మంజూరు చేశారు. రూ. 204 కోట్లతో పంచాయతీరాజ్ రోడ్లు, రూ. 328 కోట్ల నిధులతో నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్లు వేయనున్నారు.

మరిన్ని ప్రతిపాదనలు

కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మరి కొన్నింటికి అనుమతులు మంజూరు కావాల్సి ఉంది. టీఎస్ ఐఐసీ ఆధ్వర్యంలో జిల్లాలో మూడు చోట్ల గ్రీన్ బెల్టు పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇందులో ఒకటి కోట్‌పల్లి ప్రాజెక్టు సమీపంలో ఆక్వా పరిశ్రమ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అనంతగిరి గుట్టను అభివృద్ధి చేయనున్నాయి. కడా ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గ విద్యాభివృద్ధికి పెద్దపీ ట వేసిన ప్రభుత్వం, ఆ తరువాత జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్లు సమాచారం.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన గిరిజన గురుకుల విద్యార్థులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బలరాం, అధ్యాపకుడు రమేష్

- కళాశాల ప్రారంభమైన మొదటి బ్యాచ్‌లోనే ర్యాంకులు
- విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ బలరాం

కొడంగల్ రూరల్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ శివారులో గల గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాల మొదటి బ్యాచ్‌లోనే విద్యార్థులు ర్యాంకులు సాధించడంపై ప్రిన్సిపాల్ ఈ బలరాం హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న ఎంపీసీ విద్యార్థులు పి.కిషన్(65.89శాతం), రాహుల్ చౌహాన్(59.67శాతం), కె.అఖిల్(52.13శాతం), కె.నవీన్(49.57శాతం) ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వీరిని అధ్యాపకులు అభినందించారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో మరింత ప్రతిభతో మంచి ర్యాంకులు సాధించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల అధ్యాపకుల సహకారంతో విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. ఏప్రిల్‌లో నిర్వహించే అడ్వాన్స్ జేఈఈలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థి పాత్లవత్ కిషన్ మాథ్స్‌లో 96శాతం మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపకుడు ఏ రమేష్‌ను అభినందించారు.

ఆనందంగా ఉంది

మా కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జేఈఈలో ఉత్తమ మార్కులు సాధించడం సంతోషంగా ఉంది. ప్రత్యేక తరగతులు నిర్వహించి ర్యాంకులు వచ్చేలా ప్రిన్సిపాల్ బలరాం ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

– రమేష్, మ్యాథ్స్ లెక్చరర్

అధ్యాపకుల కృషి

కళాశాల ప్రారంభమైన మొదటి బ్యాచ్‌లోనే నలుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉంది. మరింత పట్టుదలతో ఏప్రిల్‌లో నిర్వహించే అడ్వాన్స్ జేఈఈలో అధిక మార్కులు సాధించాలని కోరుకుంటున్నాం.

– బలరాం, ప్రిన్సిపాల్

బాధ్యతలు స్వీకరించిన అధికారులు





జెడ్పీ సీఈఓ సుధీర్, డిప్యూటీ సీఈఓ వసంత, విక్రమ సింహారెడ్డి

అనంతగిరి: జిల్లాలో బదిలీ అయిన అధికారుల స్థానంలో పలువురు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. డీఆర్‌డీఓగా శ్రీనివాస్, జెడ్పీ సీఈఓగా సుధీర్, డిప్యూటీ సీఈఓగా వసంత, డీఎల్‌పీఓగా సంధ్యారాణి బాధ్యతలు స్వీకరించారు. డీపీఓ జయసుధ మంగళవారమే విధుల్లో చేరారు.

డీఎస్పీలకు స్థానచలనం

వికారాబాద్, తాండూరు డీఎస్పీలు నర్సింలు, శేఖర్‌గౌడ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. వీరిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. వికారాబాద్ డీఎస్పీగా సీసీఎస్‌లో ఏసీపీగా పనిచేస్తున్న అంజయ్యను, నియమించగా, తాండూరు డీఎస్పీగా హెచ్ఆర్ఎంఎల్ డీఎస్పీగా పనిచేస్తున్న బాలకృష్ణారెడ్డిని నియమించారు.

మున్సిపల్ కమిషనర్‌గా..

తాండూరు టౌన్: తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా విక్రమ సింహారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వనపర్తిలో విధులు నిర్వహిస్తున్న ఆయన తాండూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన షఫీవుల్లాకు పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ సందర్భంగా విక్రమ సింహారెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసినందున మున్సిపాలిటీపై పూర్తి అవగాహన ఉందన్నారు. అందరి సహకారంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

పేదలకు పట్టాలిచ్చే వరకు పోరాటం ఆగదు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: ప్రభుత్వం పేదలకు భూపట్టాలిచ్చే వరకు పోరాటాలు కొనసాగుతునే ఉంటాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో పేదల గుడిసెల భూపోరాటానికి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం స్థానిక కేజీఆర్ గార్డెన్‌లో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి అధ్యక్షతన ప్రథమ వార్షికోత్సవ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చాడ పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం సభలో మాట్లాడారు. చేవెళ్లలో ఇళ్ల పట్టాలకోసం ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న 700మంది పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా ఇంకా పేదలు ఇళ్లు, ఉపాధి, విద్య కోసం పోరాటాలు చేయాల్సి రావడం సిగ్గుచేటని అన్నారు. పదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం మొత్తం వ్యవస్థలను కార్పొరేట్‌పరం చేస్తోందని ధ్వజమెత్తారు. రూ.12 లక్షల కోట్లు కార్పొరేట్లకు మాఫీ చేశారని.. కార్మికులు, రైతులకు మాత్రం పైసా రుణాలు మాఫీ చేయాలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం హయాంలో పేదలకు ఇళ్లు, స్థలాలు, భూములు ఇస్తామని చెప్పి నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలని.. లేదంటే పోరాటాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేవెళ్ల ప్రాణహిత ప్రాణం తీసిందని ఈ ప్రభుత్వంలో మళ్లీ ప్రాణం పోయాలని చాడ పేర్కొన్నారు. కాళేశ్వరం అవినీతిపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని, మేడిగడ్డపై తప్పులు చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సుభాన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు విషయంలో వివాదం

- ఇరువర్గాల ఘర్షణ
- పరస్పరం రాళ్లు, కర్రలతో దాడి
- పలువురికి తీవ్ర గాయాలు
- పరిస్థితిని సమీక్షించిన పోలీసు ఉన్నతాధికారులు



పరిస్థితిని సమీక్షిస్తున్న రాజేంద్రనగర్ అదనపు డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

శంకర్‌పల్లి: సీసీ రోడ్డు వేస్తుండగా తలెత్తిన చిన్న వివాదం పరస్పరం రాళ్లు, కర్రలతో దాడి చేసుకునే వరకు వెళ్లింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జనవాడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. జనవాడలో హెచ్ఎండీఏ నిధులతో మంగళవారం సాయంత్రం సీసీ రోడ్డు వేస్తుండగా వివాదం తలెత్తింది. గ్రామంలోని చర్చి ముందు మూడు ఫీట్ల స్థలం వదిలిపెట్టి వేయాలని ఓ వర్గం కోరగా, మరో వర్గం రోడ్డు చర్చి వరకు వేస్తామని పట్టుబట్టడంతో వివాదం మొదలైంది. అది కాస్తా చినికిచినికి గాలి వానలా మారి రాత్రికి ఇరు వర్గాల వారు రాళ్లు, కర్రలు, ఇటుకలతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఇరువర్గాలకు చెందిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మోకిల పోలీసులు గ్రామానికి చేరుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోకపోవడంతో అదనపు బలగాలను రప్పించారు. రాజేంద్రనగర్ అదనపు డీసీపీ సాధన రష్మీపెరుమాళ్, నార్సింగి ఏసీపీ లక్ష్మీనారాయణ, మోకిల, శంకర్‌పల్లి, నార్సింగి సీఐలు వీరబాబు, వినాయకరెడ్డి, హరికృష్ణారెడ్డి గ్రామానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇరు వర్గాలను సముదాయించి గాయాలపాలైన వారికి చికిత్స నిమిత్తం నగరంలోని పలు ఆస్పత్రులకు తరలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 144 సెక్షన్ విధించారు. బుధవారం సైతం రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, ఎస్ఓటీ డీసీపీ రషీద్, మాదాపూర్ డీసీపీ వినీత్‌జీ, శంషాబాద్ డీసీపీ సత్యనారాయణరెడ్డి, రాజేంద్రనగర్ అదనపు డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. గ్రామంలోని సీసీ పుటేజీలను పరిశీలించారు. గ్రామంలోకి కొత్త వాహనాలను అనుమతించ లేదు.

గ్రామాన్ని సందర్శించిన పలువురు..

విషయం తెలుసుకున్న చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీంభరత్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్ లుకే, ప్రొఫెసర్ గాలి వినోద్ గ్రామాన్ని సందర్శించారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధ్యులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధితుల ధర్నా

దాడికి కారణమైన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని బాధితులు ధర్నా చేపట్టారు. దీంతో శంకర్‌పల్లి–హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అక్కడికి చేరుకుని వారి ఆందోళనకు సంఘీభావం తెలిపారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు ఆయనను అరెస్టు చేసి డీసీఎంలో ఎక్కించడంతో ఆందోళనకారులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. అక్కడే ఉన్న ఓ యువకుడు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను విడిచి పెట్టకుంటే ఆత్మహత్య చేసుకుంటానని చెప్పడంతో ఆయనను వదిలిపెట్టారు. ఆందోళనకారులను సముదాయించి ధర్నాను విరమింపజేశారు.

క్లుప్తంగా

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


హరీశ్ మృతదేహం

యాలాల: చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అన్నసాగర్ ఊర చెరువులో గ్రామానికి చెందిన కొంగి హరీశ్(26) సోమవారం రాత్రి చేపల వేటకు వెళ్లి నీట మునిగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా మంగళవారం రాత్రి వరకు రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలించినప్పటికీ మృతదేహం లభ్యమవ్వలేదు. బుధవారం తెల్లవారు జామున నీటిలో తేలడంతో ఒడ్డుకు తెచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిఘా పెంచుతాం
సీఐ అశోక్‌గౌడ్


మాట్లాడుతున్న సీఐ అశోక్‌గౌడ్

పెద్దేముల్: పోలీస్‌స్టేషన్‌లో చార్జిషీట్ ఉన్న వారిపై నిఘా ఉంచుతామని తాండూరు రూరల్ సీఐ అశోక్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన పెద్దేముల్ పీఎస్‌ను మొదటిసారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఠాణాలో చార్జిషీట్ ఓపెన్ చేసిన వారిపై నిఘా పెంచుతామన్నారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండల పరిధిలోని పాత నేరస్తులు, చార్జిషీట్ ఓపెన్ అయినవారిపై స్టేషన్‌ను పిలిచి వారితో మాట్లాడారు. ఇక ముందు ఎలాంటి కేసుల్లో జోక్యం చేసుకోవద్దని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో ఉండాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ గిరి తదితరులు పాల్గొన్నారు.

భూ క్రయవిక్రయాల్లో ఇబ్బందులు
పోలీసులను ఆశ్రయించిన బాధితులు

దోమ: మండల పరిధిలోని తిమ్మాయిపల్లికి చెందిన చీమె రాములమ్మకు తాతల వారసత్వంగా సర్వేనంబర్ 50లో 1.09 ఎకరాలు, సర్వేనంబర్ 43లో 1.20ఎకరాల భూమి ఉంది. కాగా ఆమె సర్వే నంబర్ 50లోని భూమిని ఆయూబ్ అనే రియల్టర్‌కు 2018లో విక్రయించింది. కాగా ఆయన ఇటీవల కాస్తుకు వచ్చి సర్వే నంబర్ 43లో భూమిని విక్రయించావంటూ కబ్జాకు యత్నిస్తున్నాడంటూ ఆరోపించింది. భూమిని సర్వే చేసి సర్వే నంబర్ 50లోని భూమిని అయూబ్‌కు కేటాయిస్తామని చెప్పింది. రియల్టర్ మాత్రం వినకుండా తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడంటూ ఆరోపిస్తోంది. ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితురాలు వివరించింది. బుధవారం పరిగి డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాస్ పొలాన్ని సందర్శించి భూమిని పరిశీలించారు. ఇద్దరికి సంబంధించిన రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని సీఐ చెప్పారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

బంట్వారం: ఉపాధి హామీ పనులపై రెండు రోజుల్లో సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఈసీ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు చేపట్టిన సుమారు రూ.7కోట్లతో చేపట్టిన పనులపై ఆడిట్ నిర్వహిస్తారని చెప్పారు. 11 మంది డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీ ఒకరు ఇప్పటికే రికార్డులు పరిశీలిస్తున్నారని చెప్పారు. ఆడిట్ బృందానికి ఎఫ్ఏలు, ఉపాధి కూలీలు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి

కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా


యాలాల: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు


తాండూరు రూరల్: గౌతపూర్‌లో..

యాలాల: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోవిందరావుపేటలో రూ.10లక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి చొరవతో గోవిందరావుపేట అభివృద్ధికి పునాదులు వేస్తున్నామన్నారు. 30 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ఉన్న విద్యుత్ సమస్యను ఇటీవల ఎమ్మెల్యే చొరవతో పరిష్కరించామని గుర్తు చేశారు. ఉపాధి నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణంతో అంతర్గత రోడ్లు మెరుగుపడతాయన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహాయ సహకారాలతో మరిన్ని నిధులు వెచ్చించి గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యాలాల గ్రామ అధ్యక్షుడు రాపోలు నాగయ్య, యూత్ అధ్యక్షుడు అశోక్ నాయి, పార్టీ సీనియర్ నాయకులు శేఖర్, శ్రీనివాస్, చిన్న, సంకారం లాలు, వెంకటేశ్, నర్సింలు, వెంకటేశ్, నవీన్, అనిల్, ఉమేశ్, రాజు, అంజి తదితరులు ఉన్నారు.

మండలానికి రూ.3కోట్ల నిధులు

తాండూరు రూరల్: వర్గపోరుతో కుంటుపడిన అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బాటలు వేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప అన్నారు. బుధవారం మండల పరిధిలోని గౌతపూర్‌లో ఎన్ఆర్ ఈజీఎస్ కింద రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగప్ప మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ కింద ఎమ్మెల్యే రూ.3 కోట్ల నిధులు కేటాయించారని చెప్పారు. కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాంచంద్రారెడ్డి, మల్లారెడ్డి, అంజద్‌పాషా పాల్గొన్నారు.

ప్రేమ వివాహం చేసుకున్న మహిళ బలవన్మరణం

బొంరాస్‌పేట: ప్రేమ వివాహం చేసుకున్న ఓ మహిళ ప్రేమికుల దినోత్సవం రోజునే తనువు చాలించింది. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన పందిమెడ బాబమ్మ(28), దొబ్బలి చిన్న వెంకటయ్య అలియాస్ లాలప్పలు పన్నెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం. మంగళవారం బాబమ్మ పురుగు మందు తాగింది. గమనించిన పిల్లలు తండ్రి, తాతయ్యకు చెప్పారు. దీంతో లాలప్ప, బాబమ్మ అక్క మాణెమ్మతో కలిసి అదే రాత్రి కొడంగల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తాండూరు, వికారాబాద్ ఆస్పత్రులకు తరలించారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌కు తరలిస్తుండగా తనువు చాలించింది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పులి కాదు.. హైనా!

- అడవిలో పాదముద్రల పరిశీలన
- ఆందోళన అవసరం లేదని ఫారెస్టు అధికారుల సూచన


పాద ముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ఫారెస్టులో పులి పాద ముద్రలను ఆనవాళ్లు కనిపించడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు పులిని చూశామని వాట్సప్ గ్రూపుల్లో వైరల్ చేశారు. దీంతో విషయం తెలుసుకున్న కొడంగల్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఫారుఖ్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అటవీ ప్రాంతాన్ని పరిశీలించగా హైనా పాద ముద్రల ఆనవాళ్లు కనిపిస్తున్నాయని చెప్పారు. ఇదే విషయం జిల్లా అధికారులకు తెలియజేస్తామని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దని సూచించారు. మరో 15 రోజుల పాటు ప్రతీ రోజు అటవీప్రాంత పరిశీలన చేపడతామని రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కడైనా కనిపిస్తే తమకు సమాచారం అందించాలని సెక్షన్ అధికారి కోరారు.

ట్రాన్స్‌జెండర్ల ముసుగులో మోసం

- దేహశుద్ధి చేసిన గ్రామస్తులు
- కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు


పోలీసుల అదుపులో ట్రాన్స్‌జెండర్లు

దోమ: ట్రాన్స్‌జెండర్ల పేరిట మోసం చేస్తున్న వారికి ప్రజలు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రానికి చెందిన భరతకానీ సురేందర్, భీమయ్య, సురేందర్‌లు ఓ ఆటోలో కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలో జరుగుతున్న వివాహానికి వెళ్లారు. ట్రాన్స్‌జెండర్ల ముసుగులో వివాహానికి హాజరైన వారి నుంచి డబ్బులు వసూలు చేయడం.. గ్రామంలో అనుమానంగా తిరుగుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. చిన్నపిల్లలను ఎత్తుకెళ్తున్నారని ఆరోపణల నేపథ్యంలో గ్రామస్తులు వారిని పట్టుకునేందుకు యత్నించారు. వారు తప్పించుకుని దొంగ ఎన్కేపల్లి గ్రామం వైపు వెళ్లారు. ఆగ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆ ముగ్గురికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు సమాచారం.

‘కారు’ దిగనున్న కంచర్ల?

- పదేళ్లుగా పనిచేస్తున్నా దక్కని ప్రాధాన్యం
- సొంతగూటికి వెళ్లేందుకు రంగం సిద్ధం!


చంద్రశేఖర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: సినీహీరో అల్లు అర్జున్‌కు మామ బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి(కేసీఆర్) కారు దిగి కాంగ్రెస్‌లో చేరుతారంటూ ప్రచారం సాగుతోంది. ఆదివారం ఆయన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవడంతో చర్చలకు బలం చేకూరుతోంది. మొదట్లో ఆయన కాంగ్రెస్‌లో ఉంటూ ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమించారు. చిన్నారెడ్డి కన్వీనర్‌గా కొనసాగిన కాంగ్రెస్ ఫోరం ఫర్ తెలంగాణ కమిటీలో సభ్యుడిగా పనిచేశారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఆయన సీఎం కేసీఆర్ పిలుపు మేరకు గులాబీ గూటికి చేరారు. 2014లో టీఆర్ఎస్ నుంచి శాసనసభ్యుడిగా పోటీ చేసి 22వేల సాధించారు. 2018లో టికెట్ ఆశించినా.. సైకిల్ దిగి కారెక్కిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డికే టికెట్ కేటాయించారు. అయినప్పటికీ ఆయన పార్టీ పటిష్టతకే పనిచేశారు. తన ఫౌండేషన్ ద్వారా స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టారు. పదేళ్లుగా కేసీఆర్‌ను కలిసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఆయన కాంగ్రెస్ నేతలతో ఉన్న సత్సంబంధాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ నెల 16 తర్వాత ఎప్పుడైనా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని.. ఇందుకు ఏర్పాటు చేసుకుంటున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


సునావర్ మృతదేహం

కేశంపేట: విద్యుదాఘాతంతో ఓ వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కాకునూరులో బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం మతియారీ జిల్లా రంజితా గ్రామానికి చెందిన సునావర్ మాజీ(35) కొంతకాలంగా గ్రామ శివారులోని నీల్యానాయక్ పౌల్ట్రీఫాంలో పనిచేస్తున్నాడు. ఉదయం పౌల్ట్రీ ఫాంలో దాణా కలిపే యంత్రం వద్ద పని చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

కరువు సైరన్

వేసవి సమీపించకముందే కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. చెరువులు, కుంటలు ఎండిపోయి బీటలు వారాయి. భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. సాగు, తాగునీటికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రెండేళ్లతో పోల్చితే ఈ సారి యాసంగి సాగు మండలంలో గణనీయంగా తగ్గింది. గతేడాది చివరి రెండు నెలలు చినుకైనా కురువలేదు. దీంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు.

వట్టిపోతున్న చెరువులు, కుంటలు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- సాగు, తాగు నీటికి ప్రమాద ఘంటికలు
- ఆందోళనలో అన్నదాతలు


నక్కర్తమేడిపల్లిలో ఎండిపోయిన ఊర చెరువు

యాచారం: మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు వట్టిపోయి బీటలు వారుతున్నాయి. ఇన్నాళ్లు నీటితో నిండుకుండల్లా కనిపించిన చెరువులు, కుంటలు ఎండల తీవ్రతకు ఆవిరైపోతోంది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎనిమిది వేలకు పైగా బోరుబావులున్నాయి. ఎండల తీవ్రతకు నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, మల్కీజ్‌గూడ, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, మంతన్‌గౌరెల్లి, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, నందివనపర్తి, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, మొండిగౌరెల్లి తదితర గ్రామాల్లోని వందలాది బోరుబావులు ఆగి పోస్తున్నాయి. గతేడాది వర్షాలు కురియకపోవడంతో ముందు జాగ్రత్తతోనే ఆయా గ్రామాల్లోని రైతులు పంటల సాగును తగ్గించుకున్నారు. పెట్టుబడులు పెట్టి పంటలు ఎండిపోతే కష్టంతో పాటు అప్పుల పాలయ్యే అవకాశం ఉంటుందని పంటల సాగుపైపు ఆసక్తి చూపలేదు. ఎండల తీవ్ర మొదట్లో ఇలా ఉంటే మున్ముందు ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో కరువు సైరన్ మోగినట్లేనని రైతులు భయాందోళన చెందుతున్నారు. నీటి ఎద్దడితో పశువులు, గొర్రెలు, మేకల దాహార్తి ఎలా తీర్చాలని ఆందోళన చెందుతున్నారు.

బోర్లలో నీళ్లు తగ్గాయి



వారం, పది రోజుల వ్యవధిలోనే మా గ్రామంలో బోర్లల్లో నీళ్లు తగ్గాయి. గ్రామంలోని ఎక్వ చెరువు ఉండిపోయింది. చెరువులో నీళ్లుంటే బోరుబావుల ద్వారా 1,500 ఎకరాల్లో పంటలు పండే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం తగ్గుతున్న నీటి పరిస్థితులు, భవిష్యత్‌ను తలుచుకుంటే కంటిమీద కునుకు లేకుండా పోతుంది.

– ముత్యాల రాంచంద్రారెడ్డి, రైతు, నానక్‌నగర్

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి


నారుమడిలో నరేశ్ మృతదేహం

ధారూరు: అనుమానాస్పద స్థితిలో ఓ రైతు మృతి చెందిన ఘటన బుధవారం వెలుగు జూసింది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మోమిన్‌కలాన్ గ్రామానికి చెందిన చాకలి నరేశ్(35)కు పెద్దేముల్ మండలం గోపాల్‌పూర్‌లోని స్వాతితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. గర్భంతో ఉన్న ఆమె వారం క్రితం పురుడుకు పుట్టింటికి వెళ్లింది. బుధవారం నరేశ్ తన పొలాన్ని నాటుకు సిదకథం చేస్తూ నారుమడిలోనే బోర్లాపడి మృతి చెందాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే భార్యకు సమాచారం ఇచ్చారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొందుర్గు: మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా బుధవారం ఓ వాహ నంలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. మారుతి సుజికి వాహనంలో తొమ్మిది బస్తాల్లో సుమారు ఐదు క్వింటాళ్ల బియ్యం ఉంటుందని ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

వైభవంగా వసంత పంచమి

జ్ఞాన సరస్వతి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం


హోమం నిర్వహిస్తున్న హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి

యాచారం: చదువుల తల్లికి జై.. జ్ఞాన సరస్వతీ మాతకు జై అనే చిన్నారుల నినాదాలతో నందివనపర్తి గ్రామం బుధవారం మార్మోగింది. వసంత పంచమి వేడుకలు నందివనపర్తి గ్రామంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో వైభవంగా జరిగాయి. ఆలయ పూజారి రాఘవేంద్రశర్మ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామీజీ చేతుల మీదుగా ఆలయ ఆవరణలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా వాసులతోపాటు, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్ నగర్, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ వ్యవస్థాపకుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

అక్షరాలు దిద్దించిన స్వామీజీ

విద్యారణ్య భారతి స్వామీజీ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు చిన్నారులుతో అక్షరాలు దిద్దించారు. అక్షరాభ్యాసం కోసం కావాల్సిన వస్తువులు, పూజా సామగ్రిని ఆలయ నిర్వాహకులే సమకూర్చారు. అనంతరం తల్లిదండ్రులు, తమ చిన్నారులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.


నందివనపర్తి గొప్ప క్షేత్రం కాబోతుంది

నందివనపర్తి గ్రామం భవిష్యత్తులో గొప్ప పుణ్య క్షేత్రం కాబోతుందని విద్యారణ్య భారతి స్వామీజీ అన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక అక్షరాభ్యాసం అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. చదువుల తల్లి అనుగ్రహం వలన ఈ ప్రాంతం విద్యార్థులు బాగా కష్టపడి చదువుతారన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో ఉంటారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు వెంకట్‌రెడ్డి, సమన్వయ మండలి సభ్యుడు గణేశ్, రాఘవేంద్రశర్మ, వెంకట్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, శివకుమార్, నిఖిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో వచ్చి చంపేశాడు!

రోడ్డు ప్రమాదంలో చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దుర్మరణం

- నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐకి స్వల్ప గాయాలు
- రాంగ్ రూట్లో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు
- ఎల్‌బీనగర్‌లో మంగళవారం అర్ధరాత్రి దుర్ఘటన


ప్రమాదానికి కారణమైన కారు


మృతుడు మొహమ్మద్ సాదిక్ అలీ (ఫైల్)


చికిత్స పొందుతున్న ఖాజావలీ మోహినుద్దీన్

నాగోలు: రాంగ్ రూట్లో వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మొహమ్మద్ సాదిక్ అలీ మృతి చెందారు. నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐ ఖాజావలీ మోహినుద్దీన్ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ దుర్ఘటన ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన మొహమ్మద్ సాదిక్ అలీ(40) నగరంలోని మూసారంబాగ్‌లో ఉన్న ఆంధ్రా కాలనీ ప్రభుత్వ క్వార్టర్స్ ‘ఎ’ బ్లాక్‌లో భార్య షాహేదా, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఉంటున్నారు. 2017 నుంచి చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన పని చేస్తున్నారు. సాదిక్ అలీ నివసించే క్వార్టర్స్‌లోనే నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐ ఖాజావలీ మోహినుద్దీన్ అలియాస్ బాబా ఉంటున్నారు. వీరిద్దరూ స్నేహితులు. మంగళవారం రాత్రి ఇరువురూ కలిసి ఎల్‌బీనగర్‌లో వివాహానికి హాజరయ్యారు. తిరిగి 11.40గంటలకు బైక్‌పై మూసారంబాగ్‌కు వస్తున్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంప్ వద్ద.. రాంగ్ రూట్లో వేగంగా వచ్చిన ఓ కారు.. వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో మొహమ్మద్ సాదిక్ అలీకి తీవ్ర గాయాలయ్యాయి. ఖాజావలీ మోహినుద్దీన్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మొహమ్మద్ సాధిక్ అలీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ఖాజావలీ మోహినుద్దీన్ చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ కారును అక్కడే వదిలేసి పారిపోయాడు. ఈ కారుపై ఓవర్ స్పీడ్ చలానాలు ఉన్నాయి. పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. మృతుడు సాదిక్ అలీ సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టినరోజునే..మృత్యు ఒడికి

అనారోగ్యంతో హాస్టల్ విద్యార్థి కన్నుమూత


శేఖర్ (ఫైల్)

షాద్‌నగర్: అక్షర యాత్ర చేయాలని.. అందరిలా జీవితంలో ఎదగాలని ఎంతో దూరం నుంచి ఎన్నో ఆశలతో వచ్చాడు.. కానీ తాను ఒకటి తలిస్తే విధి మరొకటి తలచింది.. జన్మదినం రోజునే అతడిని మృత్యువు ఆహ్వానించింది. అతని బంగారు భవిష్యత్‌ను అనారోగ్యం మింగేసింది. ఈ విషాదకరమైన సంఘటన షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి బీసీ గురుకుల పాఠశాలలో వెలుగు చూసింది.

చదువు కోసం వచ్చి.. తనవు చాలించి

వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కండ్లపల్లి గ్రామానికి చెందిన మేకల మమత, శేఖర్ దంపతులకు ఇద్దరు సంతానం. చిన్న కొడుకు శేఖర్(10) కొంత కాలంగా చటాన్‌పల్లిలోని బీసీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. శేఖర్ అనారోగ్యానికి గురైన విషయాన్ని హాస్టల్‌లో ఉపాధ్యాయులు గుర్తించి మంగళవారం ఉదయం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బుధవారం తెల్లవారుజామున శేఖర్ పరిస్థితి విషమించడంతో వెంటనే హాస్టల్ సిబ్బంది పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే శేఖర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హాస్టల్ సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న శేఖర్ తల్లిదండ్రులు బుధవారం ఉదయం షాద్‌నగర్‌కు వచ్చారు. తెల్లవారితే శేఖర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పాలని తోటి విద్యార్థులంతా భావించారు.. కానీ హాస్టల్ విద్యార్థులు నిద్రలేచే లోపే శేఖర్ శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయాడు. దీంతో హాస్టల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న సీఐ నవీన్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.